సబ్బవరం- గుల్లేపల్లి రోడ్డుకు మహర్దశ

- విస్తరణ పనులకు రూ.9.80 కోట్లు మంజూరు
- అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్


వుడా అధికారులతో కలిసి గుల్లేపల్లి-సబ్బవరం రోడ్డు మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే విధంగా సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డు విస్తరించనున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారం కానుందని చెప్పారు. త్వరలో విస్తరించనున్న సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డును వుడా అధికారులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డును రూ.9.80 కోట్లతో 80 అడుగుల మేర విస్తరించనున్నట్టు చెప్పారు. అధికారులతో కలిసి డీపీఆర్, మాస్టర్ ప్లాన్‌ను ఆయన పరిశీలించారు. నిధులు ఇప్పటికే విడుదలయ్యాయని చెప్పారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని వుడా అధికారులను ఆదేశించారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో.. : గతంలో పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి ఈ రోడ్డు సమస్యను తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చెప్పారు.అదే విధంగా గత నెల 18న సీఎం వైఎస్ జగన్‌ను కలిసినప్పుడు మళ్లీ ఈ రోడ్డు గురించి ప్రస్తావించడంతో ఆయన నిధులు మంజూరుకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరపున సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బ్రిడ్జిపరిశీలన.. : అదేవిధంగా రావలమ్మపాలెం జంక్షన్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపుతో పాటు శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. దీని నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మలుపులేని వంతెన నిర్మించాలని అధికారులకు సూచించారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావును ప్రస్తుతం ఉన్న రోడ్డుకు బౌండరీ ఏర్పాటు చేసి రెండు,మూడు రోజుల్లో నివేదిక సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. అవసరమైతే రైతుల నుంచి ఎంత భూమి సేకరించేది ప్రతిపాదనలు సిద్ధం చేసి భూమి సేకరించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వుడా ఎస్‌ఈ భవానీశంకర్, ఈఈ మధుసూదనరావు, డీఈ శ్రీనివాసరావు, పీవో శిల్ప, ఏపీవో చామంతి, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,వనం అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. మండలంలోని గొర్లివానిపాలెం పరిధిలోని గంగిరెడ్ల కాలనీలో రూ.10 లక్షల తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న రింగ్ రోడ్డుకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించినపుడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు తనను కోరారన్నారు. వారి వినతి మేరకు తన సొంత నిధులు రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఫార్మేషన్ చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలో ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు పూర్తి చేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, మాజీ ఎంపీపీలు గొర్లి ఉమామహేశ్వరరావు, సబ్బవరపు ముత్యాలనాయుడు, కాపుశెట్టి శేషుబాబు, బంతికోళ్ల పద్మ,దెడ్డం పద్మావతి,వనం అచ్చెంనాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం చిత్తు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష

సింహాచలం: మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితాలు దుర్భరంగా మారుతాయని సీడ్ న్యూలైఫ్ డి అడిషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి.ప్రత్యూష అన్నారు. పెందుర్తి కైట్స్‌స్కిల్స్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు గురువారం మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యూష మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రస్తుత రోజుల్లో యువత మాదక ద్రవ్యాలను వినియోగిస్తూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వినియోగం విడనాడాలని పిలుపునిచ్చారు. మద్యానికి బానిసైన వారికి చినముషిడివాడ న్యూలైఫ్ సెంటర్‌లోని పునరావాస కేంద్రంలో చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కైట్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రామునాయుడు, సిబ్బంది కె.సుభాన్, బి.ఎల్.పార్వతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజ స్తంభం ప్రతిష్ట

సింహాచలం: చింతలగ్రహారం గవరకాలనీలోని గోపాలకృష్ణ మందిరంలో బుధవారం ధ్వజస్తంభం ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేద పండితులు ధ్వజస్తంభం ప్రతిష్టా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

సింహాచలం: నాయుడుతోటలోని పెందుర్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు 14 వాహనాలను వేలం వేయనున్నట్టు పెందుర్తి సెబ్ సీఐ ఎం.సరోజాదేవి తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు తమ వెంట తీసుకుని రావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


సింహాచలం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ గోపాలపట్నం రూరల్ ఏఈ డీవీఎల్ కుమార్ తెలిపారు. అడవివరం, దారపాలెం ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో శ్రీశైలం ఈవో


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న లవన్న

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం శ్రీశైలం దేవస్థానం ఈవో లవన్న దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు.

సందడిగా మరిడిమాంబ తీర్థం


వడ్డన చేస్తున్న 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు


సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పరిధి పురుషోత్తపురంలోని మరిడిమాంబ కాలనీలో గురువారం మరిడిమాంబ తీర్థం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నవడ్డన చేశారు. కార్యక్రమంలో చందు యాదవ్, 502 సచివాలయం కన్వీనర్ గోకివాడ బుజ్జి, పార్టీ నాయకులు జొన్నాడ సాయుకృష్ణ, యలమంచిలి శ్రీను, ఆబోతు శ్రీను, రమణమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

పైడివాడ అగ్రహారంలో ఆక్రమణల తొలగింపు

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది గురువారం తొలగించారు. సర్వే నెంబర్ 1లో గతంలో ఇచ్చిన ఎన్‌టీఆర్ కాలనీని అనుకుని ఉన్న సుమారు 0.15 సెంట్ల ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి అక్రమార్కులు ఫెన్సింగ్ వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ స్పందించి ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో సౌజన్యలను ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. వారు వెంటనే ఫెన్సింగ్ తొలగించి విలువైన ప్రభుత్వ భూమి కాపడటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రతీచోట ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. 97వ వార్డు పరిధి 496 సచివాలయం పరిధిలోని సుజాతనగర్, టీచర్స్ లేఅవుట్‌లో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి మూడున్నరేళ్లుగా జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవగానే ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్,కన్వీనర్లు నాగమణి, మహేష్, సోమునాయుడు, పార్టీ నాయకులు రాంబాబు, వర్మ పాల్గొన్నారు.

విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట


ఆక్రమణల తొలగింపును అడ్డుకుంటున్న చెరువు గర్భం చదును చేసిన రైతులు

బంగారమ్మపాలెంలో ఘటన

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో సాగునీటి చెరువు ఆక్రమణకు రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. పోలీసుల సాయంతో పొక్లెయిన్‌తో గురువారం ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వివరాలు.. బంగారమ్మపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 49,50,52లలో సుమారు 20 ఎకరాల్లో సోమునాయుడు చెరువు ఉంది. దీని పరిధిలో సుమారు 250 ఎకరాల వరకూ ఆయకట్టు భూమి ఉంది. దీన్ని 100 మంది వరకూ రైతులు సాగుచేసుకుంటున్నారు. ఈ చెరువును ఆనుకుని దాడి శ్రీరాంమూర్తి కుటుంబ సభ్యులకు జిరాయితీ భూములు ఉన్నాయి. దీంతో పక్కన ఉన్న రైతులు కావడంతో పొక్లెయిన్‌తో పనులు చేపడుతూ చెరువును ఆక్రమిస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య, ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణలు సిబ్బందితో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. చెరువు గర్భం ఆక్రమించుకున్నట్టు గుర్తించి పోలీసుల సాయంతో తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కొంత సేపు పనులు చేపట్టిన తర్వాత ఆక్రమణకు పాల్పడిన రైతులు వివాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. గ్రామ పెద్దలు పలువురు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి ఈ భూమి చెరువు గర్భంగానే ఉందన్నారు. గతంలో కూడా ఈ భూమి తమదని వివాదానికి దిగిన పరిస్థితులు ఉన్నాయన్నారు. అయినప్పటికీ అది చెరువు గర్భంగానే ఉందని తెలిపారు.

జగన్నాథం కుటుంబానికి భరోసా

రూ. 5 వేల పింఛన్ మంజూరు


లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న యడ్ల నాయుడు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామంలో మంచానికే పరిమితమైన గురి జగన్నాథం కుటుంబానికి భరోసా లభించింది. ఆయనకు రూ.5 వేల పెన్షన్ మంజూరైంది. నూతనంగా మంజూరైన రూ.5 వేలు పింఛన్‌ను గురు వారం వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు,పార్టీ అధికార ప్రతినిధి ఐడిబాబు సచివాలయ సిబ్బందితో కలిసి అందజేశా రు. ఇటీవల ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినపుడు పక్షవాతంతో మంచానికే పరిమితమైన జగన్నాథం విషయాన్ని ఆయనకు వివరించామన్నారు. ఆయనపైనే కుటుంబం ఆధారపడినట్టు తెలియడంతో స్పందించిన ఎమ్మెల్యే అనకాపల్లి డీఎం హెచ్‌వోకు ఫోన్ చేసి పింఛన్ మంజూరు చేయా లని సూచించారన్నారు. పింఛన్ మంజూరు కావడంతో ఆ మొత్తాన్ని అందజేయడం జరిగిందన్నారు. గండి ముత్యాలనాయుడు, గండి దేవుళ్లు,వెల్ఫేర్ అసిస్టెంట్ రేష్మ, మహిళా పోలీస్ రోహిణి ఉన్నారు.

రాజగోపురాల ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజం

సింహాచలం: చినముషిడివాడలోని అలిమేలు మంగమ్మ ఆలయ రాజగోపురం ప్రతిష్టా మహోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయానికి ఇటీవల తూర్పు, ఉత్తర రాజగోపురాలు నిర్మాణం చేశారు. గురువారవ నుంచి ఈ నెల 5వతేదీ వరకు ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నారు. గురువారం సాయంత్రం అలిమేలు మంగాదేవి సన్నిధిలో ప్రతిష్ట పూజలు ప్రారంభించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, ధాన్యాధివాసం, నివేదన, మంగళాశాసనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు రామానుజం తదితరులు ఈ పూజలను నిర్వహించారు.

కాపు కల్యాణ మండపం ప్రారంభానికి ఏర్పాట్లు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో రూ.1.60 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణమండపాన్ని ఈనెల 4వ తేదీన ప్రారంభించనున్నట్టు శ్రీకృష్ణదేవరాయ కాపు ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

భవిత కేంద్రంలో గ్రహణం మొర్రి నిర్ధారణ శిబిరం

సింహాచలం: పెందుర్తి భవిత కేంద్రంలో గురువారం గ్రహణం మొర్రి, గ్రహణశూల గుర్తించడానికి సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ జోషి, డాక్టర్ ముకుందరెడ్డి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరమయ్యే విద్యార్థులను గుర్తించారు. వారందరికీ ఉచితంగా శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామని తెలిపారు.రవాణా ఖర్చులతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. సమగ్ర శిక్షా విశాఖ జిల్లా ఏపీసీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐఈసీ ఎం అబ్దుల్ ఆషా, భవిత కేంద్రం ఐఈఆర్‌పీ శారద, ఎనిమిది మండలాల నుంచి ఐఈ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ అధికారి బుద్ధా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రెంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రెంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు వారి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఏఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమీషన్ ఆశ చూపిస్తూ కమీషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమీషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమీషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శైలజ


భర్త విజయకుమార్‌తో శైలజ (ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్‌ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకొన్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయకుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు


పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్–విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్ –కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ – కోయంబత్తూర్ (03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం



పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ ఫర్ డెసీ లీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.'అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

మహిళకు బ్యాగ్ అప్పగింత


బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న క్రైం డీసీపీ నాగన్న

అల్లిపురం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికి పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ.. పోతినమల్లయ్యపాలేనికి చెందిన ఎం.కస్తూరిబాయి బుధవారం తమ ఇంటికి వెళ్లేందుకు జడ్జి కోర్టు వద్ద ఆటో ఎక్కారు. ఆమె వద్ద డ్రై వాష్ చీరలతో బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్ ఉంది. గొల్లలపాలెం సర్కిల్ వద్ద డ్రై వాష్ చీరల బ్యాగ్ తీసుకుని దిగిపోయారు. హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయారు. అందులో రూ.లక్ష నగదు ఉంది. కొంతసేపటి వరకు ఆమెకు తన బ్యాగ్ గుర్తుకురాలేదు. తర్వాత తేరుకుని ఆటోలో మరిచిపోయానని గ్రహించారు. ఆటోను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ క్రైం జి.నాగన్న ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐలు కె.శ్రీను, డీవీ అప్పారావు తమ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి ఆటోను పట్టుకున్నారు. డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం బాధితురాలికి నగదుతో సహా బ్యాగ్‌ను అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.